ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
3
సోమవారం 8 జనవరి 2024



దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

సుభాష్‌నగర్, జనవరి 7: రాష్ట్రంలోని దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ దివ్యాంగుల పట్టభద్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి లక్ష్మయ్య అన్నారు. ఆదివారం తెలంగాణ దివ్యాంగుల పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మండలాల వారీగా సదరం క్యాంపులు నిర్వహించాలన్నారు.ఈ సమావేశంలో నందగిరి జగదీశ్వరాచారి, మాంకాలి సుగుణ, కస్తూరి శ్రీనివాస వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వాణీనికేతన్ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న మహిళలు

చాలా సంతోషంగా ఉంది

- ప్రథమ బహుమతి విజేత గాదె లలిత (ఎలిగేడు)

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. ఎప్పటికీ ఆంధ్రజ్యోతి ఇలాగే ముగ్గుల పోటీ నిర్వహించాలని కోరుకుంటున్నా. రాష్ట్రస్థాయి పోటీల్లో ఫస్ట్‌ప్రైజ్ గెలుచుకోవాలని కోరుకుంటున్నా.

ఫస్ట్ వస్తోందనుకున్నా..

- ద్వితీయ బహుమతి విజేత కె లహరి, కిసాన్‌నగర్, కరీంనగర్

నాకు ద్వితీయ బహుమతి వచ్చింది. ఫస్ట్ వస్తోందనుకున్నా. అయినా హ్యాపీగా ఉంది. ఇలాంటి పోటీలు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ మరిన్ని నిర్వహించాలి. అందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు.

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్‌కు కృతజ్ఞతలు

- తృతీయ బహుమతి విజేత బండి విజయలక్ష్మి, భాగ్యనగర్, కరీంనగర్

పోటీలు నిర్వహిస్తున్న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్‌కు కృతజ్ఞతలు. పోలియో సోకింది. అయినా ఎడమ చేతితో ముగ్గు వేశాను. పోటీల్లో పాల్గొని బహుమతి గెల్చుకోవడం సంతోషంగా ఉంది. నిర్వాహకులకు కృతజ్ఞతలు.

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీకి విశేష స్పందన

● **ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు**

కరీంనగర్ కల్చరల్, జనవరి 7: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వాణీనికేతన్ పాఠశాల ఆవరణలో ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహించిన ముత్యాలముగ్గుల పోటీకి విశేష స్పం దన లభించింది. ప్రతియేటా సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ ముగ్గుల పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన, స్థానిక జిల్లా స్పాన్సర్ హరిహర జువెల్లర్స్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించింది. ఉదయం 10-45 గంటలకు ప్రారంభమైన ఈ పోటీలు రెండుగంటల పాటు నిర్వహించగా మహిళలు, యువతులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 60 మందికి పైగా పాల్గొని ముగ్గులు వేశారు. రంగుల ఇంద్రధనుస్సులను తలపించే రీతిలో వేసిన రంగు రంగుల ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సంక్రాంతి విశిష్టత, సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టి పడే విధంగా తీర్చిదిద్దిన ముగ్గులు ఆహూతులను మంత్రముగ్దుల్ని చేశాయి. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా బీజేపీ మహిళామోర్చ జిల్లా అధ్యక్షురాలు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, వైద్యురాలు డాక్టర్ మౌనిక హాజరై విజేతలను ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో స్పాన్సర్‌గా హరిహర జువెల్లర్స్ అధినేత, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్ వ్యవహరించి అందరితో కలసి ముగ్గురికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు 10 మందికి కన్సోలేషన్, పాల్గొన్న ప్రతి ఒక్కరికి పార్టిసిపేషన్ బహుమతులను అందించారు.



గాదె లలితకు ప్రథమ బహుమతి అందిస్తున్న హరిహర జువెల్లర్స్ అధినేత, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్

ఎలిగేడుకు చెందిన గాదె లలిత ప్రథమ బహుమతి గెలుచుకోగా ఆమెకు 6 వేల రూపాయల నగదు బహుమతిని అందజేశారు. ద్వితీయస్థానంలో నిలిచిన కరీంనగర్ కిసాన్‌నగర్‌కుచెందిన కె లహరి 4 వేల రూపాయల నగదు, తృతీయ స్థానంలో నిలిచిన కరీంనగర్ భాగ్యనగర్‌కు చెందిన బండి విజయలక్ష్మి 3వేల రూపాయల నగదు బహుమతులను అందుకు న్నారు. కాగా జి శారద, ఎ శృతి, గౌరిశెట్టి రజిత, మెలుమూరి స్వరూప, వంగల భావన, టి ప్రశాంతి, జె నిర్మల, ఎస్ సుజాత, కొత్త పుష్పలత, శ్రీనిత్యలు కన్సోలేషన్ బహుమతులను గెలుచుకున్నారు. లోగో ముగ్గులు వేసిన జె లత, సవిత, ఎస్ భవాని, జి గాయత్రిలకు బహుమతులు అందజేశారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ బ్రాంచి మేనేజర్ కళ్లెపు సంపత్‌రెడ్డి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పోటీలు నిర్వహిస్తున్నామని, స్పాన్సర్‌లకు, న్యాయ నిర్ణేతలకు, నిర్వహణకు సహకరించిన వాణీనికేతన్ యాజమాన్యానికి, సిబ్బందికి, ఉత్సాహంగా పాల్గొని ముగ్గుల పోటీలను విజయవంతం చేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. తెలుగువారి పండుగలు, సంస్కృతీ సంప్రదాయా లను భావితరాలకు అందించేందుకు పోటీలు దోహదపడుతాయని అన్నారు. ముఖ్య అతిథిగా, జిల్లా స్థాయిలో స్పాన్సర్‌గా హాజరైన హరిహర జువెల్లర్స్ అధినేత, చాంబరాఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ అందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్నాని అన్నారు. ఏబీన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో భవిష్యత్‌లో చేపట్టే సేవా, సమాజహిత కార్యక్రమాలకు తోడ్పడుతానని అన్నారు. న్యాయ నిర్ణేతలు బీజేపీ మహిళామోర్చ జిల్లా అధ్యక్షురాలు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, వైద్యురాలు డాక్టర్ మౌనిక మాట్లాడుతూ రంగుల ముగ్గుల శోభతో పండుగ కళ కనిపిస్తోందని అన్నారు. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా ముగ్గులు వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిషన్ ఇన్‌ఛార్జి పరుచూరి జయంత్‌రావు, ఏజీఎం దండ జనార్ధన్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ నూగూరి శ్రావణ్ కుమార్ (ఎడివిటీ), ఏసీఎం పాపారావు, ప్రొడక్షన్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్, సబ్ ఎడిటర్‌లు ఎస్ వేంకటరెడ్డి, జి జీవన్‌రెడ్డి, కె సునీల్‌కుమార్, ఏఓలు ఎ మునీశ్వర్, ఎం కుమార్, అకౌటెంట్ పి సంతోష్, స్టోర్ ఇన్‌ఛార్జి బి వేంకటమల్లు, సీఓ, ఏసీఓలు రాజేంద్రప్రసాద్, ఇ రమేశ్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ ఎండి షుకూర్, రిపోర్టర్లు ఎ సురేందర్‌రెడ్డి, ఎస్ రవి, డి రాజారాంమోహన్, పి మనోహర్, బి లక్ష్మణ్, సృజన్‌కుమార్, ఏబీఎన్ కెమరామెన్ డి సంపత్‌తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.


ప్రథమ బహుమతి సాధించిన ముగ్గుతో విజేత గాదె లలిత


ద్వితీయ బహుమతి సాధించిన ముగ్గుతో విజేత కె లహరి



తృతీయ బహుమతి సాధించిన ముగ్గుతో విజేత బండి విజయలక్ష్మి


ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ మహిళామోర్చా అధ్యక్షురాలు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, డాక్టర్ మౌనిక, చాంబర్‌అఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్



చిట్టుమల్ల శ్రీనివాస్‌కు మెమొంటో ఇస్తున్న ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ కళ్లెపు సంపత్‌రెడ్డి తదితరులు


ఆకట్టుకున్న ముగ్గు

ప్రజాపాలనకు భారీగా దరఖాస్తులు

● **హుజూరాబాద్ డివిజన్‌లో మొత్తం 1,10,954 దరఖాస్తులు**


హుజూరాబాద్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)

హుజూరాబాద్, జనవరి 7: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజాపాలన కార్యక్రమం చేపట్టింది. డిసెంబరు 28నుంచి జనవరి 6వరకు గ్రామాలు, మున్సిపాలిటీలలో గ్రామసభలు నిర్వహిస్తూ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ గ్రామసభలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శనివారం చివరి వరకు హుజూరాబాద్ డివిజన్‌లో 1,10,954 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో వీణవంకలో 17,628, ఇల్లందకుంటలో 10,849, సైదాపూర్‌లో 14,329, శంకరపట్నంలో 15,124, హుజూరాబాద్ మండలం, మున్సిపాలిటీలలో 26,699, జమ్మికుంట మండలం, మున్సిపాలిటీలలో 26,325 దరఖాస్తులు వచ్చాయి. గ్రామసభలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు సరిపడా కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులను తీసుకున్నారు. ప్రజలు ఎక్కువగా మహాలక్ష్మి, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, 200 యూనిట్ల విద్యుత్, నూతన రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. గ్రామ సభల నిర్వాహణకు ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్, ఆర్డీవో, స్పెషలాఫీసర్లు బృందాలుగా ఏర్పడి పనులను పర్యవేక్షించారు.

● **మొదలైన ఆన్‌లైన్ ప్రక్రియ**

ప్రజాపాలన గ్రామసభల్లో స్వీకరించిన దరఖాస్తుల వివరాలను అధికారులు శనివారం నుంచే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చారు. పంచాయతీ, మండల పరిషత్, ఈజీఎస్, సెర్ప్, వీఆర్, తహసీల్దార్ కార్యాలయాల్లోని కంప్యూటర్ ఆపరేటర్లను ఆన్‌లైన్ నమోదుకు ఉపయోగిస్తున్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయ్యాక వచ్చే రిజిస్టర్ నంబర్‌ను దరఖాస్తులపై రాస్తున్నారు. ఒక్కొక్క దరఖాస్తుకు ప్రత్యేకంగా యూనిట్ కోడ్ నంబర్‌ను కేటాయించి, లబ్ధిదారుల వివరాలను పొందుపరుస్తున్నారు. భవిష్యత్తులో ఈ యూనిట్ కోడ్ నంబర్‌ను ఆధార్‌కు అనుసంధానం చేయనున్నట్లు సమాచారం. ఈ నెల 17వరకు ఆన్‌లైన్ కొనసాగనుంది.

దివ్యాంగులకు శాపంగా 'సదరం'

- స్లాట్ బుకింగ్ కోసం మీసేవ చుట్టూ ప్రదక్షిణ
- పేరుకే స్లాట్ బుకింగ్ కానీ ఒక్కరికి అయ్యేది లేదు
- ఆందోళనలో దివ్యాంగులు



రామడుగు మీసేవ వద్ద స్లాట్ బుకింగ్ కోసం వచ్చిన దివ్యాంగులు

రామడుగు, జనవరి 7: దివ్యాంగుల ఆసరా కోసం ప్రభుత్వం ఎంతో ఆర్భాటం చేపడుతున్న సదరం వారి పాలిట శాపంగా మారింది. దివ్యాంగులు వారి వైకల్యాన్ని నిరూపించుకోవడం కోసం సదరం క్యాంపులను ప్రభుత్వం నిర్వహిస్తుంది. అయితే అందుకు నెల, రెండు నెలలకొకసారి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని నిబంధన పెట్టింది. నెలల తరబడి ఎదురుచూస్తున్న దివ్యాంగులకు ఏదో ఒక రోజు సదరం ఉందని, మీ సేవలో స్లాట్ బుక్ చేసుకోవాలని అధికారులు ప్రకటన విడుదల చేస్తున్నారు. దీంతో దివ్యాంగులు స్లాట్ బుకింగ్ కోసం కేటాయించిన రోజు మండలంలోని మీ సేవ కేంద్రాల్లో సంప్రదించగా రెండేళ్లుగా ఒక్కరికి కూడా స్లాట్ బుక్ అయిన దాఖలాలు లేవు. జిల్లాలో వివిధ కేటగిరీలకు చెందిన దివ్యాంగులకు 70 నుంచి 80 స్లాట్‌లు మాత్రమే కేటాయించి బుకింగ్ కోసం ఒక 30 నిమిషాలు మాత్రమే సైట్ ఓపెన్ అవుతుంది. దీంతో కొద్ది మందికి మాత్రమే అవకాశం ఉంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్, ఇతర సమస్యలతో ఒక్క స్లాట్ కూడా బుక్ కావడం లేదని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మ్యాన్‌వల్‌గా మండల కేంద్రాల్లో మూడు నుంచి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి అక్కడ డైరెక్టుగా వారిని పరీక్షించి వైద్యులు వైకల్య శాతాన్ని నిర్ధయించి సర్టిఫికెట్లు ఇచ్చేవారు. దీంతో దివ్యాంగులకు ఎంతో ఊరట కలిగేది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో స్లాట్‌లు బుక్‌కాక దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. నామమాత్రంగా స్లాట్ బుకింగ్ కోసం ప్రకటనలు ఇస్తూ మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి దివ్యాంగులకు మేలు జరిగే విధంగా దృష్టి సారించాలని దివ్యాంగులు కోరుతున్నారు.

నెలల తరబడి తిరుగుతున్నా ప్రయోజనం లేదు

- నాగి లచ్చయ్య, రామడుగు



నాకు నడుము విరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. అనేక సార్లు మీసేవ కేంద్రానికి వచ్చినా ఒక్కసారి కూడా బుక్ కావడం లేదు. గత అనేక నెలలుగా మీసేవ చుట్టూ తిరుగుతున్నా అయినప్పటికీ స్లాట్ బుక్ కావడం లేదు. అసలు ఎందుకు ఇలా జరుగుతుందో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైన స్పందించి మేలు చేయాలి.

ఇప్పటి వరకు నాలుగు సార్లు వచ్చాను

- ఎం సౌజన్య, దివ్యాంగురాలు, మంగపేట, గంగాధర మండలం



మాది గంగాధర మండలం మంగపేట గ్రామం. కాలు విరిగి చాలా రోజులు అవుతున్నది. స్టిక్ పట్టుకొని ఇతరుల సాయంతో రామడుగు మీసేవ కేంద్రానికి అనేకసార్లు వచ్చాను. అయితే స్లాట్ బుక్ అయ్యే రోజు ఇక్కడికి వచ్చి గంటల తరబడి వేచి చూసి నిరాశతో వెను తిరుగుతున్నాను. ప్రభుత్వం ఇప్పటికైనా కనికరించి తమలాంటి వారికి సాయం చేయాలి.

మల్లికార్జున ఆలయంలో పట్నాలు



ఆలయంలో పట్నాలు వేస్తున్న భక్తులు

చందుర్తి, జనవరి 7: చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలోని మోహినికుంట మల్లికార్జునస్వామి ఆలయానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. పాఠశాలలకు, కార్యాలయాలకు సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామికి పసుపు బండారితో పట్నాలు వేసి, బోనాలు సమర్పించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. డోలు చప్పుళ్లతో శివశక్తుల పూనకాలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దర్శనానికి క్యూలైన్లో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.

తలనీలాల టెండర్లు మళ్లీ వాయిదా?

మల్యాల, జనవరి 7: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో తలనీలాల సేకరణకు అధికారులు రెండో సారి టెండర్లు ఆహ్వానించినా వాయిదా పడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. దేవస్థానం అధికారులు ఆన్‌లైన్, బహిరంగ, సీల్డ్ టెండర్ల నిర్వహణకు గాను 8వ తేదీగా ప్రకటించారు. కాగా ఆదివారం వరకు బహిరంగ, సీల్డ్ టెండర్లకు దరఖాస్తులు దాఖలు కాలేదు. సోమవారం ఆన్‌లైన్ టెండర్లు ఓపెన్ చేయనున్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులు రాకపోతే రెండో సారి టెండర్లు వాయిదా పడనుంది. కాగా దేవస్థానం పరిధిలో అంతర్గత బదిలీలలో భాగంగా ఎస్టాబ్లిష్‌మెంట్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉమామహేశ్వర్‌రావుకు వేలం విభాగం కూడా కేటాయించారు.

జానపద గాయకుడు మృతి

- సంతాపం తెలిపిన ఎంపీ బండి సంజయ్



శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎంపీ(ఇన్‌సెట్‌లో శివకుమార్(ఫైల్))

కరీంనగర్ కల్చరల్, జనవరి 7: కళాభారతి వేదికగా పలు కార్యక్రమాల్లో జానపద గీతాలతో అలరించి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గుర్తింపు పొందిన జ్యోతీనగర్‌కు చెందిన దేశ శివకుమార్ (56) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. జిల్లా బెస్త(గంగపుత్ర) సంఘం అధ్యక్షుడిగా ఉన్న ఆయన పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై జానపద గీతాలతో అలరించారు. ఆయన మృతి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కళాకారులకు తీరని లోటని పలువురు నాయకులు, కళాకారులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, మేయర్ వై సునీల్‌రావు, మాజీ మేయర్లు రవీందర్‌సింగ్, డి శంకర్‌లు శివకుమార్ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాష్ట్ర బెస్త సంఘం అధ్యక్షుడు దీటి మల్లయ్య, టీఎన్‌జీవో నాయకుడు రాజేశం, కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్, గంగామాత ఆలయ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు సేర్వ లక్ష్మీనారాయణ, పట్టణ సంఘం అధ్యక్షుడు కూర ధర్మరాజు, జానపద వృత్తి కళాకారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గుండ్ర కృపాదానం, ఉప కార్యదర్శి గోపాల్‌రావు, కార్యదర్శి సిద్ధిపేట ప్రకాశ్, కోలాటం కళాకారుడు ఇస్మాయిల్, కళాకారులు దిండిగాల రవీందర్, కుమార్ మహర్షి, కాసు మహేందర్‌రాజు, సంగెం రాధాకృష్ణ, చిట్టి తిరుపతి, ఉపేందర్ ప్రసాద్, వైఎస్ శర్మ, అనిల్ కుమార్‌గౌడ్, కాసు మధు, ఎస్‌పీ రాధాకృష్ణ, తబలా శంకర్, కొండాల్‌రావు, రఘువీర్‌సింగ్, ఎలిగేటి రాజేందర్‌ప్రసాద్, గొల్లపల్లి శ్రీరాములుగౌడ్ సంతాపం తెలిపారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, జనవరి 7: కరీంనగర్‌లోని రాజీవ్‌చౌక్‌లో మణిదీప్ ఫ్యాబ్రిక్ హౌజ్‌లో ఆదివారం వేకువ జామున అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దాదాపు 10 లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. మణిదీప్ ఫ్యాబ్రిక్ హౌజ్ నుంచి పొగ బయటకు వస్తుండటాన్ని గమనించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేయగా కరీంనగర్ అగ్నిమాపకశాఖ అధికారులు ఘటనా స్థలంకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే షాపులోని బట్టలు దగ్ధమయ్యాయి. షాపు నిర్వాహకులు ఎప్పటిలాగానే శనివారం రాత్రి షాపును మూసివేసి ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. అర్ధరాత్రి తరువాత షాపులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకుని ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నామని ఫైర్ ఆఫీసర్ తెలిపారు. మణిదీప్ ఫ్యాబ్రిక్ హౌజ్ యజమాని తిప్పిరెడ్డి సరితారెడ్డి ఫిర్యాదుతో కేసు విచారణ జరుపుతున్నామని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో చోరీ

- కంప్యూటర్లు మాయం

- మానేరు రివర్‌ఫ్రంట్, ఎల్ఎండీ పనుల వివరాలు వాటిలోనే?



పరిశీలిస్తున్న ఎస్సై చేరాలు

తిమ్మాపూర్, జనవరి7: మండలంలోని మహాత్మానగర్ గ్రామం ఎల్ఎండీ కాలనీలో గల కార్యనిర్వాహక ఇంజనీరు కార్యాలయం ఇరిగేషన్ డివిజన్ నెంబరు-5, ఇరిగేషన్ సర్కిల్-2 కార్యలయములో ఆదివారం దొంగతనం జరిగింది. కార్యాలయ అధికారులు, ఎల్ఎండి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సెలవు దినం కావడంతో సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు కార్యలయం తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. కార్యల యంలో ఉన్న 4 సీపీయులు, 4 మానిటర్‌లు, రెండు ప్రింటర్లు సుమారు 2.50లక్షల విలువ గల వస్తువులను ఎత్తుకెళ్లినట్లు ఇరిగేషన్ అధికారులు ఎల్ఎండీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే కార్యాలయం సమీపంలోనే వేరే ఇరిగేషన్ కార్యలయంలోనే దొంగతనం జరిగి కార్యాలయంలో ఉన్న ఫైల్‌లు దొంగిలించారు. ఈ కంప్యూటర్లలో మానేరు రివర్ ఫ్రంట్ , ఎల్ఎండీ పనుల వివరాలు ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

● పనిచేయని సీసీ కెమెరాలు

ఇరిగేషన్ శాఖలో ఇరిగేషన్ డివిజన్ నెంబరు-5, కాగా దిగువ మానేరు జలశాయంకు సంబంధించి ముఖ్యమైన కార్యలయం. కీలకమైన కార్యాలయంలో సీసీ కెమెరాలు ఉన్నా అవి పనిచేయక పోవడంపై విమర్శలు వస్తున్నాయి. దొంగతనానికి పాల్పడ్డ వారు సీసీ కెమెరాలకు అనుసంధాన బాక్సును కూడా ధ్వంసం చేశారు. అల్మారాలు పగలు గొట్టినట్లు అనవాళ్లు ఉన్నాయి. ఏవైనా వస్తువులు, ఫైళ్లు ఎత్తుకెళ్లారా అనే విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. సంఘటన స్థలానికి ఎల్ఎండీ ఎస్సై చేరాలు తమ సిబ్బందితో చేరుకొని కార్యాలయాన్ని పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు



కరీంనగర్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు చొప్పరి జయశ్రీ, డాక్టర్ మౌనిక, హరిహర జువెల్లర్స్ అధినేత, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్, ఆంధ్రజ్యోతి ప్రతినిధులు



కరీంనగర్‌లో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ కళ్లెపు సంపత్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, జనవరి 7: "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగుళూరు.. రియల్ పార్ట్నర్ స్వర్గసీమ సుకేతన" ముగ్గుల పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభించింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో 60 మంది మహిళలు పాల్గొన్నారు. కరీంనగర్ భాగ్యనగర్‌కు చెందిన బండి విజయ లక్ష్మి అనే మహిళ అంగవైకల్యం ఉన్నప్పటికీ ఒక చేత్తో ముగ్గు వేసి మూడవ బహుమతి సాధించారు. ఇక్కడ ఎనిమిదేళ్ల చిన్నారి మొదలుకొని, 80 సంవత్సరాల వృద్ధురాలి వరకు పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పెద్దపల్లి జిల్లాలో నిర్వహించిన పోటీలకు 108 మంది మహిళలు హాజరై ముగ్గులు వేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీలకు 126 మంది మహిళలు హాజరై అవనికి రంగులు అద్దారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ కేంద్రంలో నిర్వహించిన పోటీలో 32 మంది మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. కరీంనగర్‌లో జరిగిన కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా, జిల్లా స్థాయిలో స్పాన్సర్‌గా హరిహర జువెల్లర్స్ అధినేత, చాంబరాఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్ వ్యవహరించారు. న్యాయ నిర్ణేతలుగా బీజేపీ మహిళామోర్చా జిల్లా అధ్యక్షు రాలు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, వైద్యురాలు డాక్టర్ మౌనిక వ్యవహరించారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ బ్రాంచి మేనేజర్ కళ్లెపు సంపత్‌రెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి పరుచూరి జయంత్‌రావు, ఏజీఎం దండ జనార్దన్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ నూగూరి శ్రావణ్ కుమార్ (ఎడివిటీ), ఏసీఎం పాపారావు, ప్రొడక్షన్ ఇన్‌చార్జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, జనవరి 7: వేములవాడ శ్రీరాజ రాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి శనివారం రాత్రి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ వసతి గదుల్లో విడిది చేసిన భక్తులు ఆదివారం తెల్లవారు జామునే శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకునేందుకు బారులు తీరారు. భక్తులు ముందుగా ధర్మగుం డంలో పవిత్ర స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. ఆయా క్యూలైన్‌ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు శ్రీ స్వామి వారిని దర్శించుకుని మొక్కు లు చెల్లించుకున్నారు. అనంతరం కోరిన కోర్కెలు తీర్చాలను కోడెమొక్కు, గండాలు తొలగిపోవాలని గండాదీపంలో నూనే పోసి రాజన్నను వేడుకున్నారు. ఆలయ అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.



వేములవాడలో క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 7: రాజస్థాన్‌లో ఈనెల 9 నుంచి 13 వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడకారులు జైనపురం వంశీ, బి శివలు ఎంపికయ్యారు. డిసెంబర్ 8న తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రెడ్డవేని మధు, జిట్టవేణి శ్రీనులు తెలిపారు. ఈ సందర్భంగా ఈ క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యద ర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, పెటా అధ్యక్ష, కార్యదర్శులు అంతడుప్పుల శ్రీనివాస్, యూనిస్ పాషా, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సంఘ బాధ్యులు కలిగేటి శ్రీనివాస్, జట్టుపల్లి అశోక్, రాజ్ కుమార్, అనుప రెడ్డి, వీర్‌పాల్ రెడ్డి, భాస్కర్, ఐతరవేని శ్రీనివాస్, వడ్లూ రి రాజేందర్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరి రిమాండ్

చిగురుమామిడి, జనవరి 7: మండలంలోని ఇందుర్తి, రామంచ గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న బురికి ప్రభాకర్, పల్లం నర్సయ్య అనే ఇద్దరిని ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. రెండు గ్రామాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండ అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు తనిఖి చేశామని తెలిపారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవని తెలిసింది. ఇందుకు గాను ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు ఎస్సై తెలిపారు. మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుకను ఎవరైనా తరలించుకుపోతే గ్రామస్థులు సమాచారం అందించాలని కోరారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

గంగాధర, జనవరి 7: గంగాధరలో సోమవారం నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్నిస్ బాల్‌తో నిర్వహిస్తున్న టోర్నమెంటులో గెలుపొందిన జట్టుకు 30వేల నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్ జట్టుకు 15వేలు షీల్డ్‌ను అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉమ్మడి జిల్లా సీనియర్స్ ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 7: జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సీనియర్స్ ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది మహిళలు, పురుషులు హాజరయ్యారు. ఈ క్రీడా పోటీలను డీవైఎస్‌వో కీర్తి రాజవీరు, సీనియర్ ఖో-ఖో క్రీడాకారులు మంగ సంతోష్, రేణులకు క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ఖో-ఖో జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభచాటి రాష్ట్ర చాంపియన్లుగా నిలవాలన్నారు. జిల్లాకు ఖో-ఖోలో మంచి పేరు ఉందన్నారు. ఈ సంవత్సరం కూడా ఉమ్మడి జిల్లా జట్టు ఉత్తమమైన ప్రతిభ చాటి రాష్ట్ర చాంపియన్‌గా నిలవాలన్నారు. జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్ రవి, వై మహేందర్‌రావులు పోటీలను పర్యవేక్షించగా, వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా ఖో-ఖో సంఘ సభ్యులు ఎ రవీందర్, డి ప్రసాద్, యోగి, సంతోష్, కరుణాకర్, బి శేఖర్, శివకుమార్, రాజబాబు, రవళి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

జమ్మికుంట, జవనరి 7: జమ్మికుంట పట్టణ పరిధిలోని పద్మశాలి వీధికి చెందిన ఒకరు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ సీఐ బర్పటి రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పద్మశాలి వీధికి చెందిన సిలివేరు ధనుష్ (18) అనే వ్యక్తి కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధ పడుతున్నాడు. చికిత్స తీసుకున్నా వ్యాధి నయం కాలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ టీచర్ మృతి



రాజయ్య(ఫైల్)

కరీంనగర్ క్రైం, జనవరి 7: కరీంనగర్ గాంధీ చౌరస్తా సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యారణ్య పురి కాలనీకి చెందిన రిటైర్డ్ టీచర్ బత్తిని రాజయ్య(76) మృతిచెం దినట్లు కరీంనగర్ మూడో టౌణా పోలీసులు తెలిపారు. విద్యారణ్యపురికి చెందిన రాజయ్య మంచిర్యాల చౌరస్తా నుంచి స్కూటీపై గాంధీ చౌరస్తా వైపు వెళ్తుండగా వెనుక వైపు నుంచి మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మరణించినట్లు వెల్లడించారు. మృతుడి కొడుకు అనిల్ కుమార్ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ధర్మపురిలో మల్లన్న భక్తుల సందడి

ధర్మపురి, జనవరి 7: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం మల్లన్న భక్తుల సందడి నెలకొంది. షష్ఠి వారోత్సవాలు పురస్కరించుకుని క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులు నెత్తి మీద మల్లికార్జున విగ్రహాల పెట్టెను పెట్టుకుని త్రిశూలం చేత పట్టుకుని నది వద్దకు చేరుకున్నారు. అనంతరం భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు చేశారు. అలాగే నదీ జలాలతో మల్లికార్జున విగ్రహాలను శుభ్రం చేశారు. నది వద్ద గల స్నానఘట్టాలు, ఇసుక మేటల పైన ప్రత్యేకంగా సైకత లింగాలు చేసి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు త్రిశూలం, ఒగ్గు డోలు చేత పట్టుకుని మెడలో పూల దండ వేసుకుని భక్తి పాటలు పాడుతూ భక్తులు విగ్రహాల పెట్టెలతో తిరుగు ప్రయాణం చేశారు. పట్నాలు వేసిన మరునాడు వేములవాడ, కొమురవెల్లి, ఓదేల, ఐనవోలు ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకునేందుకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు గోదావరి నది వద్ద మల్లన్న భక్తులతో సందడి నెలకొంది. కాగా ఎల్లమ్మ పట్నాలు వేసుకునే భక్తులతో పాటు కొందరు తమ పిల్లలకు కేశ ఖండనం చేసి గంగమ్మ తల్లికి తెప్పె మొక్కులు తీర్చుకునేందుకు కూడా అధికంగా తరలి వచ్చారు. ఎగువ భాగాన గల దమ్మ న్నపేట, రాజారం వద్ద గోదావరి నది నీరు శుభ్రంగా ఉందని భావించి భక్తులు అక్కడికి వెళ్లి స్నానాలు ఆచరించారు. ఎస్సై దత్తాత్రి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు.



ధర్మపురిలో స్నానాలు ఆచరిస్తున్న మల్లన్న భక్తులు

వేంకటేశ్వర ఆలయంలో వైభవంగా లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన చేస్తున్న వేదపండితుడు



ప్రత్యేక అలంకరణలో స్వామి

కోరుట్ల, జనవరి 7: పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం కొరాయి ఉత్సవం (వన మహోత్సవం) వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి సమయంలో స్వామి వారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని వేద పండితుడు బీర్నంది నర్సింహామూర్తి మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన వేదపండితులు పుష్పార్చన కార్యక్రమాన్ని జరిపారు. కొరాయి ఉత్సవంలో భా గంగా వేంకటేశ్వర - అలివేలు మంగ - పద్మావతి సహిత ఉత్సవ విగ్రహాల కు ప్రత్యేక పూజలను నిర్వహించి అభిశేకం, అర్చన కార్యక్రమాలను జరిపారు. వేంకటేశ్వర భజన మండలి సభ్యులతో భజన కార్యక్రమాలను జరిపారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

9న ఉద్యోగ మేళా

గణేశ్‌నగర్, జనవరి 7: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు మంగళవారం ఉదయం 10గంటల నుంచి 2 గంటల వరకు జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కే దేవేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆక్సిస్ బ్యాంకు, త్రేడ్జ్ ఐటీ, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్టులో పనిచేయుటకు ఆఫీసర్, సీనియర్ ఆఫీసర్, అసిస్టెంట్ మేనేజర్, ఐటీ మేనేజర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్, టెలి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఫార్మసిస్టు, క్లర్క్, గ్రాడ్యుయేట్ ట్రైనీ, మెకానిక్, డ్రైవర్స్, క్లీనర్ పోస్టులు కలవని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, డిప్లమా, ఐటీ, బిటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బిఫార్మ, ఎంఫార్మ, డిఫార్మ కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. వయస్సు 18-30 సంవత్సరాల్లోపు ఉండాలని, వేతనం 12 నుంచి 25 వేల రూపాయల వకు ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతీ, యువకులు సంబంధిత విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్, ఎక్స్‌పీరియన్స్ కాపీలతో జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జరిగే ఉద్యోగమేళాలో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాలకు 7207659969, 9700922136 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తిరుపతిరావు



భగత్‌నగర్, జనవరి 7: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా అన్నమనేని తిరుపతి రావు ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని జిల్లా కార్యాలయంలో తపస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సహాధ్యక్షులు ఐల్నేని నరేందర్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు తక్షణమే పదోన్న తులతో కూడిన బదిలీలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయుల కొరతను నివారించేందుకు వెంటనే విద్యా వలంటీర్లను నియమించాలన్నారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కట్ట రాజేశ్వర్, రంగా రావు, రాష్ట్రకార్యదర్శులు అంబటివేణు, కుమార్, బొట్ల రామస్వామి, రంగారావు, రాధిక, సుధాకర్, ఉదయ్ కిరణ్‌రావు, శ్రీనివాస్‌రాజు, కరుణాకర్‌రావు, శ్రీనివాస్, పవన్ కుమార్, ఐలయ్య, సంపత్‌కుమార్, శ్రీనివాస రాజు, రవి, వేణుగోపాల్, సంపత్ ఎన్నికల అధికారి మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అబద్ధాలతో పబ్బం గడుపుతున్న బీజేపీ, కాంగ్రెస్

-మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్ అర్బన్, జనవరి 7: ప్రజాక్షేత్రంలో గెలువలేక బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సోషల్ మీడియా ద్వారా అబద్ధాలు ప్రచారం చేయిస్తూ పబ్బం గడుపుకుంటున్నాయని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ధ్వజమెత్తారు. ప్రతిమ మల్టీప్లెక్స్‌లో బీఆర్ఎస్ నాయకులతో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ జెన్‌కోలో సీఎండీ ప్రభాకర్‌రావు బోయినపల్లి సరితరావు అనే యువతికి ఏఈ ఉద్యోగం ఇచ్చారని.. నెలకు 1.5 లక్షల జీతభత్యాలు ఇస్తున్నారని, ఆ యువతి మాజీ ఎంపీ వినోద్‌కుమార్ బంధువు అని తీన్మార్ మల్లన్న క్యూ న్యూస్‌లో ప్రసారం చేశారని పేర్కొన్నారు. దీనిపై బీజేపీ, కాంగ్రెస్ సోషల్ మీడియా వాళ్లు దుష్ప్రచారం చేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణ రావు, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, మేయర్ సునీల్‌రావు, సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్ టౌన్, జనవరి 7: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు గాల్‌రెడ్డి హర్షవర్దన్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు మల్లు రవికి వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ తెలంగాణ జిల్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అట్ల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థి లక్కీమీరానికి అవార్డు



అవార్డు అందుకుంటున్న లక్కీ మీరాని

కరీంనగర్ కల్చరల్, జనవరి 7: జిల్లాకు చెందిన అంధ విద్యార్థి లక్కీ మీరాని నటించి దర్శకత్వం వహించిన లఘుచిత్రం లైట్ అండ్ డార్క్ చిత్రానికి హోటల్ బెంగుళూరు ఇంటర్నేషనల్‌లో మెరిట్ అవార్డు-2023, షైనింగ్ స్టార్ ఆఫ్ సౌత్ ఇండియా 2023 అవార్డును ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో మెండ ఫౌండేషన్ అధినేత అర్జున్‌దాస్, చత్రు, స్ఫోసి చైర్మన్ బలిలాల్ చబారియా, అధ్యక్షుడు ప్రమోద్ చబారియా, అశోక్ రతన్, ప్రకాశ్, దీపక్ మీరాని, ముస్కాన్ మీరాని, తదితరులు అభినందించారు. జిల్లాకు చెందిన డాక్టర్ ఇ ప్రసాదరావు, డాక్టర్ విజయేందర్‌రెడ్డి, డాక్టర్ శైలజ, దిలీప్ మోత్వాని, రాజు మోత్వాని, ఎం రమేశ్‌రెడ్డి, తదితరులు లక్కీమీరానికి అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జనవరి 7: నగరంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ సాయినేని నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని 11కేవీ కమాన్ ఫీడర్ పరిధిలోని లక్ష్మీనగర్, మధుగార్డెన్, గాయత్రీనగర్, షాషామహల్, 11కేవీ మంకమ్మతోట ఫీడర్ పరిధిలోని మంకమ్మ తోట, పొన్నం కాంప్లెక్స్, కశ్మీర్‌గడ్డ, గోపాల్‌రావు భవనం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇల్లందకుంట, జనవరి 7: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ స మ్మేళనం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబు ద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. 26సంవత్సరాల త ర్వాత పలకరించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఇల్లందకుంట, జనవరి 7: మండలంలోని కనగర్తికి చెందిన సిరిమల్లె శ్రీకాం త్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఆదివారం ఫోన్‌లో పరామర్శించారు బీజేపీ నాయకులు మృతుడి కుటుంబానికి 50కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో పవన్‌రెడ్డి, బా ల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సంపత్, రాజు, శరత్, భరత్, సతీష్ పాల్గొన్నారు.

'దళితబంధు రెండో విడత డబ్బులు విడుదల చేయాలి'

హుజూరాబాద్, జనవరి 7: రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసిన దళితబంధు రెండో విడత డబ్బులు వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సుమారు 1,500 కుటుంబాలకు రెండో విడత డబ్బులు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. వాటిని వెంటనే దళితులకు అందించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని తెలిపారు.

ప్రభుత్వ విప్‌కు సన్మానం

ఇల్లందకుంట, జనవరి 7: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఇంజం వెంకటస్వామి, మారపల్లి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సన్మానించారు. విప్‌ను ధర్మపురి నియోజకవర్గంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కులం పేరుతో దూషించిన ఒకరిపై కేసు

వీణవంక జనవరి 7: మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన కనకం వెంకటస్వామిని చల్లూరు గ్రామనికి చెందిన నల్లవెల్లి తిరుపతి కులం పేరుతో దూషించగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. వెంకటస్వామి తన భూమిలో ఇంటి నిర్మాణం చేపడుతుండగా తిరుపతి పను లు నిలిపవేయాలని కులం పేరుతో దూషించాడని ఫిర్యాదు చేశాడని చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మాజీ ఎంపీ పరామర్శ

జమ్మికుంట రూరల్, జనవరి 7: జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వ ర్‌రావును మాజీ ఎంపీ బో యినపల్లి వినోద్‌కుమార్ ఆదివారం హైదరాబా ద్‌లోని యశోధ ఆసు పత్రిలో పరామ ర్శిం చారు. దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడ్డ వ్యక్తుల ను చట్ట పరంగా శిక్షిం చాలని డిమాండ్ చేశా రు. అధైర్య ప డవద్దని, అవిశ్వాసం వీగి పో తుందని చెప్పారు. ప్రజ లు బీఆర్ఎస్ పార్టీ వైపు ఉన్నారని తెలిపారు.



రాజేశ్వర్‌రావును పరామర్శిస్తున్న వినోద్‌కుమార్.

సమాజంలో మార్పు కోసం న్యాయవాదులు కృషి చేయాలి

-హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్

కరీంనగర్ అర్బన్, జనవరి 7: సమాజంలో అభి వృద్ధి, మార్పు కోసం న్యాయవాదులు కృషి చేయా లని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి వేణు గోపాల్ అన్నారు. ఆదివారం నగరం లోని ఓ విద్యాసంస్థలో జస్టిస్ కుమారయ్య లా కాలేజీలో చదివిన న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తిని ఎంచుకొని స్థిరపడా లని అనుకునేవారు ప్రతిసవాళ్లు ఎదుర్కో వాలని అన్నారు. న్యాయవాద వృత్తిలోని అనుభ వాన్ని గడించుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. న్యాయవాదులు అణ గారిన వర్గాల అభి వృద్ధికి, సమాజ చైతన్యానికి తమవంతుగా చేయూత నందించాలని కోరారు. అనంతరం న్యాయవాదులకు జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ కుమారయ్యా లా కాలేజీ ప్రిన్సిపాల్, కరస్పాం డెంట్ డాక్టర్ కె.జలజ, డైరెక్టర్ జి కృష్ణ ప్రసాద్, ఆత్మీయ సమ్మేళన కన్వీనర్ ఎ.కిరణ్ కుమార్, న్యాయమూర్తి కె.వెంకటేశ్, న్యాయవాదులు ఏపీ రమణ, గుండా భవాని, పొన్నం రజిత, మంతెన సురేష్ కుమార్, గాదం స్వామితేజ, బొంకూరి మోహన్, బండారు గాయత్రీ దేవి, ఎండీ నవాజ్, పత్తి శివప్రసాద్, వంకాయల రాజ్‌కుమార్, అట్ల దీరజ్, సావుల రాజమౌళి, ఆడెపు దినేష్, అతికం రాజశేఖర్‌గౌడ్, ఎన్నం మమత, తాడూరి స్వాతి, బత్తిని స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

ది ప్లే స్కూల్‌లో క్రీడా దినోత్సవం



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న చిన్నారులు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 7: జిల్లా కేంద్రంలోని జగిత్యాల రోడ్‌లోగల ది ప్లే స్కూల్‌లో ఆదివారం క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీవైఎస్‌వో కీర్తి రాజవీరు, జిల్లా సంక్షేమాధికారి సరస్వతిలు హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్ర మాలు ఆకట్టుకున్నాయి. అలాగే విద్యార్థుల, తల్లిదండ్రుల ఆటల పోటీలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పొల్సాని సుధాకర్‌రావు, సెక్రటరీ రమాదేవి, ప్రిన్సిపాల్ ప్రభాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

సుభాష్‌నగర్, జనవరి7: చలికాలంలో ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ వినయ్ అన్నారు. ఆదివారం నగరంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో మెడి కవర్ ఆసుపత్రి, ఐఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ టాక్‌లో ఆయన మాట్లాడుతూ చలికాలంలో శ్వాసకోశ సమస్యలు ఎక్కువగా వస్తుంటాయన్నారు.

ఆస్తమా పేషంట్లు చలి, దుమ్ము, ధూళి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సంచరిం చాల్సి వచ్చినప్పుడు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రపంచాన్ని వణికించిన కరోనాకు వ్యాక్సినేషన్ కార ణంగా ప్రాణాపాయ ముప్పు తప్పి సీజనల్ వ్యాధిగా మారిం దన్నారు. వాకర్స్ అడిగిన పలు ప్రశ్నలకు సమాధా నాలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, మెడికవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి మల్లారెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ రోహిణి, మార్కెటింగ్ హెడ్ కరుణా కర్, హెచ్ఆర్ మేనేజర్ ఈశ్వర్, ఆపరేషన్స్ మేనేజర్ సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞవరాహక్షేత్రంలో సరస్వతీ యజ్ఞం

కరీంనగర్ కల్చరల్, జనవరి 7: శనిగర సరస్వతీ క్షేత్ర నిర్మాత అష్టకాల నృసింహరామశర్మ ఆశీస్సులతో 486వ సరస్వతీ యజ్ఞం పార్వెళ్ళ ఫణిశర్మ వైదిక నిర్వహణలో ఆదివారం యజ్ఞవరాహ క్షేత్రంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సర్వవైదిక సంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, యజ్ఞ కర్త సూర మీనాక్షి శ్రీనివాస్, విద్యాచరణ్‌శర్మ, మనోహరశర్మ, భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్, జనవరి7: నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ధర్మారం మండలం మల్లాపూర్‌లోని టీఎస్ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మల్లాపూర్ గర్ల్స్ పాఠశాలలో 1992-93లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈసంద ర్భంగా పూర్వ విద్యార్థులు గురువులతో కలిసి నాటి జ్ఞాపకాలను నెమరు వేసు కున్నారు. విద్య నేర్పిన ఉపాధ్యాయులను సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు ప్రేమల, దేవేందర్ రెడ్డి, యమున, సరోజినీ, నరసింహారెడ్డి, కరుణాకర్, వీరేశం, పూర్వ విద్యార్థులు మన్నె సరిత, బి శాంత, ఎం విజయకుమారి, శిరీష, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా పాలనను చూసి ఓర్వలేకపోతున్న బీఆర్ఎస్'

కరీంనగర్ అర్బన్, జనవరి 7: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా పాలనను చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక పోతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొత్తకొండ శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కుటుంబం మాత్రమే తెలంగాణ కోసం పోరాడినట్లు కేటీఆర్, కేసీఆర్, హరీశ్‌రావులు ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో పేదలకు కనీసం రేషన్‌కార్డులు ఇప్పించలేని మంత్రులు, ఎమ్మె ల్యేలకు ప్రజా పాలన గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కాకముందే బీఆర్ఎస్ నాయకులు ఎదురు దాడి చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేసీ ఆర్‌కు పదేళ్ల తర్వాత జనం, కార్యకర్తలు గుర్తుకొచ్చినట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ ఎస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఇప్పటికే రెండు గ్యారెం టీలను అమలు చేసిన మా కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా గ్యారెంటీలతో పాటు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చి పేద ప్రజలకు అండగా ఉంటుందన్నారు. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు ప్రతి ఒక్కరు జవాబు దారీగా ఉంటూ పేదలకు సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తున్నారన్నారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న సాగర్

సుభాష్‌నగర్, జనవరి 7: ప్రతి ఒక్కరూ వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాప కుడు దనపురి సాగర్ అన్నారు. ఆదివారం సరస్వతి నగర్‌లోని బాలకుటీర్‌లో ఉంటు సరస్వతి శిశుమందిర్‌లో చదువు తున్న విద్యార్థులు వివేకానంద జయంతిని పురస్క రించుకుని వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన పలువురు విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో బాలకుటీర్ మేనేజర్ గీకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్ల కోసం నిరీక్షణ

- డీడీలు కట్టిన 859 మంది
- 156 మందికి మంజూరు
- మరో 703 మంది ఎదురుచూపు

మానకొండూర్, జనవరి 7: మానకొండూర్ మండలంలోని వివిధ గ్రామాల కు చెందిన గొల్ల, కురుమలు గొర్రెల యూనిట్ల కోసం ఆరు నెలల క్రితం డీడీలు కట్టిన ఇప్పటి వరకు యూనిట్లు మంజూరు కాకపోవడంతో గొర్రెల పెంపకం దారులు ఆందోళన చెందుతున్నారు. అప్పటి రాష్ట్రప్రభుత్వం రెండో విడత కిం ద గొర్రెల యూనిట్ల కోసం డీడీలు కట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మండలంలో 1,734 మంది సభ్యులకు గాను 859 మంది సభ్యులు ఒక్కొక్కరు 43,750 రూపాయల చొప్పున ఆరు నెలల క్రితం డీడీల రూపంలో చెల్లించారు. ఇందులో 156 మందికి మాత్రమే గొర్రెలను పంపిణీ చేసిన ప్రభుత్వం 703 మంది సభ్యులకు మొండి చెయ్యి చూపింది. దీంతో ఆరు నెలలుగా గొర్రెల యూనిట్ల కోసం గొర్రెల పెంపకం దారులు ఎదురు చూస్తున్నారు. ఒక్క యూని ట్‌లో 20 ఆడ గొర్రెలు, ఒక్క పొట్టేలును అప్పటి రాష్ట్రప్రభుత్వం మంజూరు చే సింది. మొదటి విడత కింద మంజూరు అయిన గొర్రెలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని ఏలూరులో కొనుగోలు చేశారు. ప్రస్తుతం రెండో విడుత కింద డీడీలు చె ల్లించిన 703 మంది తమకు యూనిట్లు అందించాలని కోరుతున్నారు.

వైద్య శిబిరానికి స్పందన



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇల్లందకుంట, జనవరి 7: మండల కేంద్రంలో ఇండో అమెరికన్ ఫిజీషియన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభిం చింది. ఈ శిబిరాన్ని గ్రామస ర్పంచ్ కంకణాల శ్రీలత-సురేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ మేర కు సుమారు 200మంది రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మం దులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీలత వైద్యులను ఘనంగా సన్మానించారు. ఎన్ఆర్ఐ వైద్యులు వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ నేరేళ్ల దామోదర్ మాట్లాడుతూ ఇండో అమెరికన్ ఫిజిషియన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా మూడు నాలుగు సార్లు వివిధ మండలాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు విజయ భాస్కర్, రాంకిరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానకొండూర్: మానకొండూర్‌లో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. కరీం నగర్‌లోని క్రిస్టల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహిం చిన వైద్య శిబిరంలో 117 మందికి వైద్య పరీక్షలు నిర్వ హించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వై ద్యులు ఎండీ అబ్దుల్ ఖాదర్, ఎండీ ఖాజామొయినోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సైదాపూర్, జనవరి 6: ప్రతిమ ఫౌండేషన్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సమ న్వయంతో నిరుద్యోగ యువ తకు కల్పిస్తున్న ఉచిత శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని, ప్రతిమ ఫౌండేషన్ మండల ఆర్గనైజర్ మండల జంపయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఎలక్ట్రిషన్, హౌజ్‌వైరింగ్ నేర్చుకునేం దుకు ఆశక్తిగల 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉన్న యువకులు ఈ కోర్సులో చేర వచ్చని తెలిపారు. వివరాలకు 9912916 836లో సంప్రదించాలని కోరారు.

శ్రీరామ పూజిత అక్షింతలు పంపిణీ



అక్షింతలతో తరలివెళ్తున్న గ్రామస్థులు

గంగాధర, జనవరి 7: గంగాధర మండలంలోని పలుగ్రామాల్లో ఆయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ పూజిత అక్షింతలు ఊరేగించి ఇంటింటికీ పంపిణీ చేశారు. భక్తులు భాజాభజంత్రీలతో వెళ్లి లక్ష్మీదేవిపల్లి, హిమ్మత్‌న గర్, గంగాధర, నాగిరెడ్డిపూర్ గ్రామాల్లో అక్షింతలను అంద జేశారు. కార్యక్రమంలో ఆ యా గ్రామాల సర్పంచ్‌లు చంద్రయ్య, గంగాధర్, పం జాల లక్ష్మి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిధుల విడుదలపై హర్షం

వీణవంక జనవరి 7: రజక, నాయీబ్రాహ్మణుల కుల వృత్తుల నిర్వహణకు 79కోట్ల 85 లక్షల రూపాయలు విడుదల చేయడంపై తెలంగాణ రజక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల సంపత్ హర్షం వ్యక్తం చేశారు. స్థానికంగా ఆదివారం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఉచిత విద్యుత్ బకాయిల బిల్లులు చెల్లించక పోవడంతో ఇబ్బంది పడ్డామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడగానే రజకుల కష్టాలను చూసి వేంటనే నిధులు విడుదల చేయడం అభినందనీయమని కొనియాడారు. బీసీ కులస్తులక ప్రభుత్వ చేయూతనిచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో గూడ సమ్మయ్య, తడిగొప్పుల రవి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రామనామంతో మారుమోగాలి

- మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్

తిమ్మాపూర్, జనవరి 7: రామనామంతో పల్లెలన్నీ మారుమోగాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ఆరెపల్లి మోహన్ పిలుపునిచ్చారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ పూజిత అక్షింతలను గడప గడపకు వితరణ చేసే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అయోధ్యలో నిర్మించే రాంమందిర్ కోసం ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేశారని చెప్పారు. హిందు వుల చిరకాల కోరిక నెరవేరిందని తెలిపారు. గ్రామ, గ్రామాన అంక్షితలు పంపిణీ చేయాలని కోరారు. ప్రతి ఇంటికీ చేరేలా కార్యకర్తలు. నాయకులు ప్రజలు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుండ్ర నీలమ్మరాజయ్య, ఉప సర్పంచ్ కేతిరెడ్డి తిరుపతి రెడ్డి, ఇతర నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

శంకరపట్నం, జనవరి 7: తెలంగాణ ప్రాంత పద్మ శాలి సంఘం అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌రావు గుండెపోటుతో మృతి చెందగా ఆదివారం మండల కేంద్రంలో పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో గజ్జెల్లి హను మంత్, తుమ్మ రఘుపతి, గుండా సురేష్, వొడ్నాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీరాముడి అక్షింతలు పంపిణీ

కరీంనగర్ కల్చరల్, జనవరి 7: ఆంజనేయ సేవా సమితి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం శివాలయం వీధిలో అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్టు అక్షింతలు, చాలీసా పుస్తకాలు, రాముని ఫొటోలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొండమీది తిరుపతి స్వామి, గుగ్గిళ్లపు రమేశ్, దుబాల శ్రీనివాస్, శ్రీరాముల శ్రీకాంత్, శ్రీరాముల మధు, శ్రీరాముల రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'అద్దం నా చిరునామా కాదు' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, జనవరి 7: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని జగిత్యాలరోడ్‌లో గల విద్యుత్ ఇంజనీర్ల సంఘ భవనంలో ఆదివారం రచయిత్రి తోట నిర్మలారాణి రచించిన 'అద్దం నా చిరునామా కాదు' పుస్తకావిష్కరణ నిర్వహించారు. అఖిల భారత తెరవే అధ్యక్షుడు జూకంటి జగన్నాథం హాజరు కాగా బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. జూకంటి జగన్నాథం మాట్లాడుతూ స్త్రీ వాదంలో గత ఐదు దశాబ్దాలుగా వస్తున్న పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో కేంద్రసాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు బెల్లంకొండ ప్రసేన్, రచయితలు అన్నవరం దేవేందర్, బూర్ల వేంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం, కందుకూరి అంజయ్య, దామరకుంట శంక రయ్య, పెనుగొండ బసవేశ్వర్, పి సరసిజ, బి హరిప్రియ, తెరవే జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్ పాల్గొన్నారు. ఇదే సభలో తెరవే ప్రతి యేడు ఇస్తున్న అలిశెట్టి స్మారక పురస్కారాన్ని 2023కు గాను తోట నిర్మలారాణికి ప్రకటించారు.

పారమిత హెరిటేజ్ పాఠశాల వార్షికోత్సవం

కరీంనగర్ రూరల్, జనవరి 7: పారమిత హెరిటేజ్ పాఠశాలలో సత్యోత్సవం పేరిట ఆదివారం ఘనంగా వార్షికోత్సవం నిర్వహించారు. పారమిత, ఎక్స్ ప్లోరికా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదువుతూ ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. సత్యోత్సవలో భాగంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. స్కాలర్ షిప్‌పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 6నుండి 9వ తరగతుల విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పారమితి విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, వినోదరావు, రాకేష్‌ప్రసాద్, ప్రాచీ, వియుఎం ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు రితేష్ మోహత, ప్రొగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయ కర్తలు రాము, రబీంద్రపాత్రో, హరిప్రియ, సరిత, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, వివిధపాఠశాలల కరస్పాండెంట్లు, ప్రముఖ విద్యావేత్తలు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళా హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

గణేశ్‌నగర్, జనవరి 7: నాణ్యమైన భోజనం పెట్టని రాంనగర్‌లోని గిరిజన మహిళా హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హాస్టల్‌ను సందర్శించారు. ఈసందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేష్ పటేల్, తిరుపతి మాట్లాడుతూ భోజనంలో నాణ్యత పాటించకపోవడం వల్ల గిరిజన బాలికలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఐడీసీ మాజీ చైర్మన్‌కు పరామర్శ

కరీంనగర్ అర్బన్, జనవరి 7: టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తల్లి ఈద కమలాదేవి మృతి చెందగా ఆయనను, కుటుంబసభ్యులను మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆదివారం పరామర్శించారు. ఈసందర్భంగా కమలాదేవి భౌతికకాయం వద్ద పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అలాగే నగరంలోని బొల్లినేని తిరుపతమ్మ మృతిచెందగా మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ వై సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, సివిల్ సప్లై కార్పొరేషన్‌మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, నాయకులు నాగరాజు, సంపత్‌గౌడ్, తదితరులున్నారు.

టీఆర్‌టీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

కరీంనగర్ టౌన్, జనవరి7: టీఆర్‌టీఎఫ్ జిల్లా శాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమే ష్, రాష్ట్ర కార్యదర్శి దయాకర్, సర్వర్, ఫైనార్టీ కన్వీనర్ రెహమాన్, రాష్ట్ర కార్యదర్శి భాను ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు కాజా మంజూరలి, ప్రధాన కార్యదర్శి చింతపల్లి అశోక్‌రావు, నాయకులు ప్రభాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, రేగులపాటి రమ ణారావు, సలీం, చంద్రశేఖర్, రాజ్ మనోహర్ రెడ్డి, అనిల్, వెంకటేశ్వర్, రఘురామారవు, లక్ష్మీపతి, వెంకటేశ్వర్, మల్లే శం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వోపా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 7: విశ్వబ్రాహ్మణ అఫీషి యల్స్ అండ్ ప్రొఫెషనల్స్(వోపా) ఆధ్వర్యంలో నగరంలోని బృందావన్ గార్డెన్‌లో ఆదివారం ముగ్గులు, ఉపన్యాస, పాటల పోటీలను నిర్వహించారు. అతిథులుగా వోపా రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణాచారి, జిల్లా అధ్యక్షుడు కట్ట విష్ణువర్ధన్, గద్దె సత్యనారాయణ, మునిగంటి శ్రీనివాస్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఉప్పలశ్రీహరి, అధక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుమల వెంకటేశ్వర్లు, గాలిపెల్లి శంకరయ్య, కోశాధికారి యాస్వాడ చంద్రమౌళి, ఉపాధ్య క్షులు మధుసూదనాచారి, శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యు లు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

కరీంనగర్ కల్చరల్, జనవరి 7: నగరంలోని జడ్పీ క్వార్టర్స్ ఆవరణలో గల అయ్యప్ప స్వామి దేవాలయంలో తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసి యేషన్ కరీంనగర్ జిల్లా శాఖకు 2022-23 అధ్యక్షునిగా వ్యవహరించిన డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, ఆయన సహ చర వర్గం కలిసి ఆదివారం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ప్లాంట్‌ను రాష్ట్ర తానా ప్రెసిడెంట్, వాసు దేవ హాస్పిటల్ యజమాని డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ వి రాకేశ్, డాక్టర్ నగేశ్, డాక్టర్ తిరుపతిరెడ్డి, డాక్టర్ వేంకటేశ్వర్‌రావు, డాక్టర్ శ్రీధర్, ఆలయ ఈవో కొన్న కాంతారెడ్డి పాల్గొన్నారు.

'ఉద్యమకారులను విస్మరించిన ప్రభుత్వం'

సుభాష్‌నగర్, జనవరి 7: గత ప్రభుత్వం ఉద్యమకా రులను విస్మరించిందని ఉద్యమకారుల రాష్ట్ర ఫోరం చైర్మెన్ డాక్టర్ చీమ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నగరం లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను ఐక్య పరుస్తూ ఆత్మగౌరవం సంక్షేమం కోసం 33 జిల్లాల్లో కార్య క్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మెనిఫెస్టోలో పొందు పరిచి ఉద్యమకారులను గుర్తించిందన్నారు. ఈ నెల 7 నుంచి 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు పురమల్ల శ్రీనివాస్, ఓరుగంటి ఆనంద్, కనకం కుమారస్వామి, ప్రసన్న పాల్గొన్నారు.